క్లుప్తంగా

హుండీ ద్వారా రూ.38.02లక్షల ఆదాయం

తిరుమలగిరి(జగ్గయ్యపేట): ప్రముఖ పుణ్య క్షేత్రం వాల్మీకోద్భవ వెంకటేశ్వరస్వామి వారికి భక్తులు సమర్పించిన కానుకల హుండీ ద్వారా రూ.38.02 లక్షల ఆదాయం లభించినట్లు ఆలయ ఇన్‌చార్జ్ ఈవో జయప్రకాష్‌బాబు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో బుధవారం హుండీ లెక్కింపు నిర్వహించారు. 61 రోజులకుగాను రూ.38.02లక్షల ఆదాయం వచ్చినట్లు వివరించారు. వేదాద్రి ఆలయ ఈవో హేమలతాదేవి, సిబ్బంది, పాల్గొన్నారు.

లింగాలపాడులో ..

నందిగామ: మండలంలోని లింగాలపాడు శ్రీలక్ష్మీ పేరంటాళ్ళ అమ్మవారి ఆలయ హుండీని బుధవారం లెక్కించగా రూ.1,36,900 ఆదాయం వచ్చినట్లు ఈవో ఫణికుమార్ తెలిపారు. హుండీ లెక్కింపులో భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేదాద్రిలో..

వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలోని యోగానంద లక్ష్మీనరసింహస్వామి వారికి వేలం పాటల ద్వారా రూ.3.46లక్షల ఆదాయం వచ్చినట్లు ఈవో హేమలతాదేవి తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఏడాది కాలానికి పొంగళి షెడ్డు, షామియానా లైసెన్స్ హక్కులకు బుధవారం బహిరంగ వేలం నిర్వహించగా, తద్వారా రూ.3.46లక్షలు ఆదాయం వచ్చినట్లు వివరించారు. ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



కంచికచర్ల : స్థానిక వసంతకాలనీలో కొలువై ఉన్న నాగలక్ష్మి అమ్మవారి ఆలయ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి మహన్యాసపూర్వక అభిషేకాలు, నీరాజన మంత్ర పుష్పములు, అష్టోత్తర పూజలు చేశారు. ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ నిర్వాహకులు, భక్తులను అన్న సమారాధన చేశారు.

మజ్జిగ పంపిణీ



జగ్గయ్యపేట అర్బన్: పట్టణానికి చెందిన వ్యాపారి ఆకుల ఉపేంద్ర తనకుమారుడు ఆకుల వినీత్‌కుమార్ జ్ఞాపకార్థం స్థానిక ముక్త్యాల రోడ్‌లో ప్రజలకు బుధవారం మజ్జిగ పంపిణీ చేశారు. వాసవీ క్లబ్ అనుబంధ విభాగం ఆనందవనం క్లబ్ అధ్యక్షుడు చిత్తలూరి శేఖర్, వాసవీ క్లబ్ రీజన్ సెక్రటరీ చిన్నం సీతారామకృష్ణ ప్రసాద్, క్లబ్ ప్రతినిధులు పేరూరి నరసింహారావు, కర్లపాటి కొండ, రాయపూడి శ్రీకాంత్, ఎర్నాకుల రాంబాబు, పెనుగొండ రామకృష్ణ, దారా మనోజ్, ఆనందవనం క్లబ్ మాజీ అధ్యక్షుడు మణికంఠ పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందనలు



జగ్గయ్యపేట అర్బన్: జిల్లా అండర్–19 క్రికెట్ జట్టుకు కెప్టెన్, వైస్‌కెప్టెన్‌లుగా జగ్గయ్యపేటకు చెందిన ఏసీఏ, కేడీసీఏ, బీవీసాగర్ స్పోర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ క్రికెట్ అకాడమిలో శిక్షణ పొందుతున్న టి.వరుణ్‌సాత్విక్, ఎస్.భానువరప్రసాద్ ఎంపికయ్యారు. టి.వరుణ్ సాత్విక్, ఎస్.భానువరప్రసాద్‌లను జగ్గయ్యపేట లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ ఎస్.రాజాకేశవప్రసాద్ బుధవారం అభినందించారు. క్రీడాకారులకు క్రికెట్ బ్యాట్‌ను బహూకరించారు. కార్యక్రమంలో క్రికెట్ కోచ్ ఎస్.రాజేంద్ర, క్రికెట్ అకాడమీ సభ్యులు పాల్గొన్నారు.

సప్తగిరి సంకీర్తనలతో పులకించిన వేంకటేశ్వరుడు

విజయవాడ కల్చరల్: శ్రీ వెంకటేశ్వరా సంకీర్తనా అకాడమీ, శ్రీ కంచిపీఠపాలిత వేంకటేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న పద కవితా పితామహుడు తాళ్ళపాక అన్నమాచార్య 616 జయంతి వేడుకలు బుధవారం ముగిసాయి. తాళ్ళపాక అన్నమాచార్యుడు రచించిన సంకీర్తలు భావములోన, బ్రహ్మకడిగిన పాదము, పొడగంటిమయ్య, కొండలలోన, నారాయణతే నమో నమో, ముద్దుగారే యశోద కీర్తనలు టీటీడీ ఆస్థాన గాయనీ గాయకులు గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్, బుల్లెమ్మ, అన్నమయ్య మధురంగా గానం చేశారు. సప్తగిరుల గోష్ఠిగానంలో నగరానికి చెందిన పలువురు గాయనీ గాయకులు పాల్గొన్నారు. గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్‌ను, బుల్లెమ్మను నిర్వాహకులు సత్కరించారు. అలివేలు మంగా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామికి వైభవంగా ఊంజల్ సేవ నిర్వహించారు. ఉదయం జరిగిన సంకీర్తన సేవలో దుగ్గిరాల హస మేధ, చింతలపాటి మంజుల, సీతారత్నం బృందం, కె. అలిన్‌కుమార్, జయతి, మహతి, దివ్య మీనా కృష్ణన్ పాల్గొన్నారు.

మహిళలే విజేత నిర్ణేతలు



● కీలకంగా మారిన మహిళలు ● పురుషుల కంటే అదనంగా 4410మంది ఓటింగ్



నందిగామ మండలం ఐతవరంలో ఓటేసేందుకు బారులు తీరిన మహిళా ఓటర్లు (ఫైల్)

కంచికచర్ల: నందిగామ అసెంబ్లీ నియోజకవర్గంలో విజేతను నిర్ణయించడంలో మహిళా ఓటర్లు కీలకంగా మారారని చెప్పవచ్చు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఈనెల 13వతేదీన జరిగిన పోలింగ్‌లో నందిగామ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోనూ పురుషుల కంటే మహిళలే అధికంగా ఓటుహక్కును వినియోగించుకున్నారు. నందిగామ నియోజకవర్గంలో మొత్తం 2,05,480 మంది ఓటర్లు ఉండగా 1,79, 952మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. మొత్తం 87.58శాతం పోలింగ్ నమోదైంది. ఓటుహక్కు వినియోగించుకున్నవారిలో పురుషులు 87,769మంది ఉండగా, మహిళలు 92,179మంది, థర్డ్‌జెండర్ ఓటర్లు నలుగురు ఉన్నారు. పురుషులతో పోల్చితే 4,410మంది మహిళలు అధికంగా ఓటుహక్కును వినియోగించుకున్నారు.

ప్రతి మండలంలోనూ మహిళలదే పైచేయి..

నందిగామ నియోజకవర్గంలో నందిగామ పట్టణంతోపాటు నందిగామ, చందర్లపాడు, కంచికచర్ల, వీరులపాడు మండలాలు ఉన్నాయి. అన్ని మండలాల్లో కలిపి మొత్తం 222 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. నందిగామ పట్టణంతోపాటు ప్రతి మండలంలోనూ పురుష ఓటర్లతో పోల్చితే మహిళా ఓటర్లే అధికంగా ఓటుహక్కును వినియోగించుకున్నారని గణాంకాలు చెబుతున్నాయి. నందిగామ పట్టణంలో 14,118మంది పురుషులు ఓటుహక్కు వినియోగించుకోగా, మహిళలు 14,973మంది ఓటేశారు. నందిగామ మండలంలో పురుషులు 10,456మంది ఓటేయగా, మహిళలు 10,963మంది ఓటేశారు. చందర్లపాడు మండలంలో పురుషులు 21,485మంది ఓటెయ్యగా, మహిళలు 22,182మంది, కంచికచర్ల మండలంలో 23,961మంది పురుషులు ఓటు వేయగా, 25,526మంది మహిళలు ఓటేశారు. వీరులపాడు మండలంలో 17,448మంది పురుషులు ఓటేయగా, 18,499మంది మహిళలు ఓటేశారు. ఇలా నందిగామ పట్టణంతోపాటు అన్ని మండలాల్లోనూ పురుషుల కంటే మహిళలే అధికంగా ఓటుహక్కును వినియోగించుకోవడం గమనార్హం.

161 పోలింగ్ కేంద్రాల్లోనూ...

నియోజకవర్గంలో 222 పోలింగ్ కేంద్రాలు ఉండగా, 161 పోలింగ్ కేంద్రాల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికసంఖ్యలో తరలివచ్చి ఓటుహక్కును వినియోగించుకున్నారు. కేవలం 61కేంద్రాల్లో మాత్రమే పురుషులు మహిళల కంటే అధికసంఖ్యలో ఓటుహక్కును వినియోగించుకున్నారు. కంచికచర్లలోని ఎంపీయూపీ స్కూల్ పాతభవనంలోని 208వ నంబరు పోలింగ్ కేంద్రంలో పురుషుల కంటే మహిళలు 156మంది అధికంగా ఓటుహక్కును వినియోగించుకోవడం గమనార్హం. ఈ పోలింగ్ కేంద్రం పరిధిలో 511మంది పురుష ఓటర్లు ఉండగా, కేవలం 382మంది మాత్రమే ఓటేశారు. ఇక్కడ మహిళా ఓటర్లు 579మంది ఉండగా 538మంది ఓటేశారు. మహిళలతో పోల్చితే పురుషులు అత్యధికంగా ఓటేసినది కూడా కంచికచర్ల మండలంలోని పెండ్యాల జెడ్పీ హైస్కూల్‌లోని తూర్పువైపున ఉన్న మొదటి రూమ్‌లో ఏర్పాటు చేసిన 173పోలింగ్ కేంద్రంలో పరిధిలో కావడం గమనార్హం. ఇక్కడ మహిళలతో పోల్చితే పురుషులు 66మంది అధికంగా ఓటేశారు. నందిగామ నియోజకవర్గంలో పురుషులతో పోల్చితే మహిళా ఓటర్లు 4410మంది అధికంగా ఓటేసి ఓటుకు ఉన్న ప్రాధాన్యాన్ని తెలియజేయడంతోపాటు తమ చైతన్యాన్ని చాటిచెప్పారు. ఇలా నందిగామ నియోజకవర్గంలో విజేతను నిర్ణయించడంలో మహిళా ఓటర్లు కీలకంగా మారారని చెప్పవచ్చు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా



జగ్గయ్యపేటలో శిబిరానికి హాజరైన విద్యార్థులు



కంచికచర్లలో డ్యాన్స్ నేర్చుకుంటున్న విద్యార్థులు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని జిల్లా గ్రేడ్–1 స్థాయి గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ఉత్సాహంగా కొనసాగుతుంది. ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులకు ఆయా అంశాలలో శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా బుధవారం విద్యార్థులచే వారు శిక్షణాశిబిరంలో నేర్చుకున్న కథలు, పొడుపు కథలు, పద్యాలు చెప్పించారు. అనంతరం తెలుగు దస్తూరి పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాల పిఈటి మణిరత్నం ఖోఖో క్రీడ నిబంధనలను వివరించి విద్యార్థులచే ఆడించారు. కార్యక్రమంలో కవి, ఉపాధ్యాయుడు దోసపాటి నాగేశ్వరరావు, గ్రంథాలయాధికారి ఎ.ప్రభ, సిబ్బంది శ్యామల, రమేష్, సత్యవతి పాల్గొన్నారు.

కంచికచర్లలో..

కంచికచర్ల : రాష్ట్ర ప్రభుత్వం వేసవి సెలవుల్లో విద్యార్థులు ఎండలో తిరగకుండా ఉండేందుకు గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తోందని, ఈ శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కంచికచర్ల గ్రంథపాలకుడు అల్లూరు రామచంద్రుడు కోరారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో బుధవారం వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. విద్యార్థులచే పుస్తక పఠనం చేయించారు. యోగా, నృత్యం, చిత్రలేఖనంపై విద్యార్థులకు శిక్షణనిచ్చారు. విద్యార్థులు ఆటపాటలతో ఉల్లాసంగా..ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమంలో విశ్రాంత గ్రంథపాలకుడు రంగిశెట్టి వెంకటేశ్వర్లు, ఐఈఆర్టీ ఉపాధ్యాయుడు ఎం.కనకారావు, రచయిత నీలం సర్వేశ్వరరావు, యోగా గురువు ఎం.మల్లికార్జునరావు, డాన్స్ మాస్టర్ వేల్పుల ప్రకాష్, విద్యార్థులు పాల్గొన్నారు.



కంచికచర్లలో చెస్ ఆడుతున్న విద్యార్థులు

వ్యర్థాల దగ్ధంతో భూసారానికి ముప్పు

నందిగామ: కొంతమంది రైతులు పంటల సాగు తర్వాత పొలంలో మిగిలిన పంట అవశేషాలను దగ్ధం చేస్తుండటంతో భూసారం తగ్గిపోతోందని వ్యవసాయాధికారులు గుర్తుచేస్తున్నారు. ఇలా పంటల అవశేషాలను దగ్ధం చేయడం పర్యావరణానికి కూడా ముప్పు ఏర్పడుతుందని పర్యావరణ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. మరికొన్నిసార్లు ఈ అవశేషాల దగ్ధం కారణంగా అగ్నిప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. రైతులు పంటల అవశేషాలను దగ్ధం చేయకుండా ఉండేందుకు ఈ విషయంపై రైతులకు అవగాహన కల్పించేందుకు ఆయాశాఖల అధికారులు చేస్తున్న ప్రయత్నాలు కూడా ఫలించడం లేదు. ఏటా ఖరీఫ్ సాగుకు ముందు అధిక శాతం మంది రైతులు తమ పొలాల్లోని పంటల అవశేషాలను దగ్ధం చేస్తున్నారు. ఈ పంటల అవశేషాలను దగ్ధం చేయకుండా, పొలంలో కలియదున్నాలని వ్యవసాయాధికారులు రైతులకు సూచిస్తున్నారు. కలియదున్నడం ద్వారా అవి భూమిలో కుళ్లిపోయి ఎరువుగా మారాతాయని చెబుతున్నారు రైతులు ఆదిశగా చర్యలు తీసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

పంట అవశేషాలను తగులబెడితే తలెత్తే అనర్థాలివే...

- నేలలో తేమశాతం గణనీయంగా తగ్గిపోతుంది.



- భూమిలోని సేంద్రియ కర్బనం, ఆమ్లగుణం తగ్గిపోతుంది .
- నేల స్వాభావిక లక్షణాలు మారిపోతాయి.
- పర్యావరణ కాలుష్యం పెరిగి, ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుంది.
- భూసారం తగ్గిపోవడంతో పరోక్షంగా దిగుబడులు తగ్గిపోతాయి.
- అవశేషాలను దగ్ధం చేస్తే భూమి పొరల్లో పంటకు, నేలకు మేలుచేసే కొన్ని వేలరకాల సూక్ష్మజీవులు నశించిపోతాయి.
- భూసారం దాదాపు పూర్తిగా తగ్గిపోతుంది. ఫలితంగా అధిక మోతాదులో రసాయన ఎరువులు వినియోగించాల్సి దుస్థితి ఏర్పడుతుంది. తద్వారా నేల సమతుల్యత దెబ్బతింటుందని వ్యవసాయాధికారులు వివరిస్తున్నారు. ఇకనైనా రైతులు పంటల అవశేషాలను దగ్ధం చేయరాదని వారు సూచిస్తున్నారు.

సజావుగా సంక్షేమం



అనిగండ్లపాడులో నీటమునిగిన వరి పనలు(ఫైల్)



ముచ్చింతాల వద్ద నీటిలో తేలుతున్న వరికంకులను చూపిస్తున్న రైతులు(ఫైల్)

- అన్నదాతలకు ఇన్‌పుట్ సబ్సిడీ జమ
- ఆదుకున్న రాష్ట్రప్రభుత్వం
- హర్షం వ్యక్తంచేస్తున్న రైతులు

పెనుగంచిప్రోలు: ఎన్నికల పోలింగ్ ముగిసిన తరువాత కూడా అప్పటివరకు కొనసాగిన సంక్షేమాన్ని పట్టించుకునే ప్రభుత్వాలు చాలా అరుదు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాత్రం ఎన్నికలతో సంబంధం లేకుండా ప్రజాసంక్షేమమే తనధ్యేయమని మరోసారి నిరూపించింది. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిసిన వెంటనే ఆయా సంక్షేమ పథకాలకు సంబంధించిన నగదు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయడం ద్వారా సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజాసంక్షేమం విషయంలో తన విశ్వసనీయత మరోసారి చాటిచెప్పింది. ఎన్నికల ముందు సంక్షేమ పథకాలతోపాటు రైతులకు పెట్టుబడి రాయితీ నిధులు, నంట నష్టపరిహారం సొమ్ము ఇచ్చేందుకు ప్రభుత్వం ఎంత ప్రయత్నించినా చంద్రబాబు ఎన్నికల కమిషన్‌పై ఒత్తిడి తెచ్చి అడ్డుకున్న విషయం విదితమే. ఈనేపథ్యంలో పోలింగ్ ముగిసిన వెంటనే రాష్ట్రప్రభుత్వం ఆయా పథకాలకు సంబంధించి లబ్ధిదారుల బ్యాంకుఖాతాల్లో నగదును జమ చేస్తూ ఇచ్చిన మాటను నిలబెట్టుకుంది.

తుఫాన్ నష్ట పరిహారం విడుదల...

గతేడాది 2023 డిసెంబర్ నెలలో వచ్చిన మిచాంగ్ తుఫాన్ అన్నదాతలను దారుణంగా నష్ట పరిచింది. ముఖ్యంగా వరి సాగు రైతులు ఎక్కువగా నష్టపోయారు. ఎన్టీఆర్ జిల్లాలో వ్యవసాయ పంటలకు సంబంధించి 19,637 మంది రైతులు 11,232.94 హెక్టార్లలో నష్టపోగా వారికి నష్ట సరిహారం కింద 1880.53 లక్షలు రైతుల ఖాతాల్లో జమయ్యాయి. అలాగే ఉద్యాన పంటలకు సంబంధించి 169 మంది రైతులకు సంబంధించి 106.85 హెక్టార్లలో పంట దెబ్బతినగా, 19.68 లక్షల నష్ట పరిహారాన్ని రాష్ట్రప్రభుత్వం బాధిత రైతుల ఖాతాల్లో జమచేసి వారిని ఆదుకుంది. పంట నష్టపరిహారాన్ని రాష్ట్రప్రభుత్వం అందజేయడంతో ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్న రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో వ్యవసాయ, ఉద్యాన పంటలు సాగు చేసిన రైతులకు సంబంధించి దెబ్బతిన్న పంటల వివరాలు. ప్రభుత్వం అందించిన సాయం వివరాలు ఇలా ఉన్నాయి.

నియోజకవర్గం	రైతులు	హెక్టార్లు	ఇన్‌పుట్ సబ్సిడీ(రూ.లక్షల్లో)
మైలవరం	9220	5942.67	రూ.1009.24
తిరువూరు	5629	2632.04	రూ. 446.39
నందిగామ	3802	2240.49	రూ. 354.93
జగ్గయ్యపేట	1129	500.25	రూ. 85.20
విజయవాడ ఉత్తరం	26	26.34	రూ. 4.14
	19806	11,341.79	రూ.1899.90

పెట్టుబడి సమయంలో పరిహారం వచ్చింది..



గతేడాది మిచాంగ్ తుఫాన్ కారణంగా వరి పంట నష్టపోయాం. ఎన్నికల ముందు రైతులకు నష్టపరిహారం డబ్బులు రాకుండా చంద్రబాబు అడ్డుకున్నారు. పంటనష్టపరిహారంగా రూ.10వేలు నా బ్యాంకు ఖాతాల్లో జమచేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

జీతం వెంకయ్య, రైతు, వెల్దుర్తిపాడు

సంతోషంగా ఉంది..



ఎన్నికల పోలింగ్ ప్రక్రియ పూర్తయిన తరువాత కూడా రాష్ట్ర ప్రభుత్వం బాధిత రైతుల ఖాతాలో సొమ్ము జమచేయడం సంతోషంగా ఉంది. గతేడాది మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో వరి పంట దెబ్బతింది. రెండు ఎకరాలకు నష్ట పరిహారంగా రూ.8వేలు జమ చేశారు. ప్రభుత్వ నిర్ణయం ఎంతో ఉపశమనమిస్తోంది.

బారు అంజమ్మ, రైతు, గుమ్మడిదుర్రు

విత్తన ఎంపిక ఎంతో కీలకం

వత్సవాయి : మే నెల ముగుస్తుండటంతో ఇప్పుడిప్పుడే వాతావరణంలో మార్పులు వస్తున్నాయి...రుతుపవనాలు చురుగ్గా వస్తూ వానలు పడుతున్నాయి...మరో కొద్దిరోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది. రైతన్నలు కాడి పట్టి పొలాలను బాగుచేసే పనిలో బీజీ అయ్యారు...ఏ రకం విత్తనం కొనుగోలు చేయాలనే ఆలోచనలో ఉన్నారు. ఈ సమయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని, లేదంటే మార్కెట్లో కల్తీ విత్తనాల బారిన పడి నష్టపోయే ప్రమాదం ఉందని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి...

వ్యవసాయంలో అత్యంత ప్రధానమైనది నాణ్యమైన విత్తనాల ఎంపిక. ఇదే రైతు దశ, దిశను మార్చేది. విత్తన కొనుగోలులో ఏ మాత్రం అజాగ్రత్తగా వ్యవహరించినా రైతన్న తీవ్రంగా నష్టపోవాల్సివస్తుంది. అప్రమత్తత ఎంతో అవసరం. అందుకే విత్తనాల కొనుగోలులో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వత్సవాయి వ్యవసాయాధికారి వి. రవికుమార్ సూచిస్తున్నారు. రైతులు పాటించాల్సిన సూచనలను తెలియజేశారు.

రైతులు పాటించాల్సిన జాగ్రత్తలు...

- వ్యవసాయశాఖ అనుమతులు ఉన్న డీలర్ల వద్ద నుంచే ఆయా విత్తనాలను కొనుగోలు చేయాలి.
- దుకాణాదారుడి నుంచి కచ్చితంగా రశీదును తీసుకోవాలి. అరువుగా విత్తనాలు కొనుగోలు చేసినా సరే రశీదు తప్పక తీసుకోవాలి.
- చినిగిన ప్యాకెట్లు, మార్కెట్ ధర కంటే తక్కువ ధరకే ఇస్తామని చెబితే నమ్మరాదు.
- కంపెనీ పేరులేని, లూజుగా కేజీల చొప్పున విక్రయిస్తున్న విత్తనాలను కొనుగోలు చేయరాదు.
- కొనుగోలు చేసిన ప్యాకెట్లపై కంపెనీ సీలు ఉందో లేదో గమనించుకోవాలి.
- మొలక శాతాన్ని పరిశీలించుకోవాలి. మొలక శాతం సంతృప్తిగా ఉంటేనే నాటుకోవాలి.
- మొలకెత్తే దశ, పూతదశలో విత్తన లోపాలు కనిపిస్తే వెంటనే వ్యవసాయశాఖ అధికారుల దృష్టికి తీసుకురావాలి.
- విక్రయదారుడు ఇచ్చే బిల్లును పంట పూర్తయ్యే వరకు జాగ్రత్తగా భద్రపరుచుకోవాలి.

ఖరీఫ్ కోసం సిద్ధం చేసిన పొలం



ప్రశాంతంగా పాలిసెట్ కౌన్సెలింగ్

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం పాలిటెక్నిక్ కోర్సులకు సంబంధించి పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరిగింది. 33,001 నుంచి 38వేల ర్యాంకు వరకు ఉన్న అభ్యర్థులు కౌన్సెలింగ్‌లో వారి సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకున్నారు. కౌన్సెలింగ్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, కో ఆర్డినేటర్ బాలసుబ్రహ్మణ్యం పర్యవేక్షించారు.

'పోకల'కు మాజీ ఎమ్మెల్సీ పరామర్శ

దాచవరం(వీరులపాడు): కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మండలంలోని దాచవరం గ్రామానికి చెందిన కమ్యూనిస్టు నాయకుడు పోకల వెంకటనారాయణను ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ బుధవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకుని ప్రజాక్షేత్రంలోకి రావాలని ఆకాంక్షించారు. వెంకటనారాయణను పరామర్శించిన వారిలో కాకర్లమూడి ఐజయ్య, పలువురు నాయకులు ఉన్నారు.

అలర్లు సృష్టిస్తే కఠిన చర్యలు : ఎస్‌ఐ

పెద్దాపురం(వీరులపాడు): గ్రామాల్లో అలజడులు సృష్టిస్తే సహించేది లేదని, అటువంటి వ్యక్తులపై కఠినచర్యలు తీసుకుంటామని ఎస్ఐ మహాలక్ష్మణుడు హెచ్చరించారు. మండలంలోని పెద్దాపురంలో బుధవారం పోలీస్ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు నేపథ్యంలో గ్రామాల్లో అందరూ శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరారు. నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు. అల్లర్లు, ఘర్షణలకు యత్నిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలో 144 సెక్షన్ అమలులో ఉన్నందున జనం గుంపులుగా ఉండరాదని సూచించారు.

శివాపురంలో కార్డన్ సెర్చ్



పోలీసు సిబ్బందికి సూచనలిస్తున్న ఏసీపీ డాక్టర్ రవికిరణ్



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

శివాపురం(పెనుగంచిప్రోలు): మండలంలోని శివాపురంలో నందిగామ ఏసీపీ డాక్టర్ బి.రవికిరణ్ ఆధ్వర్యంలో సబ్‌డివిజన్ పరిధిలోని పోలీసులు బుధవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటిని జల్లెడ పట్టారు. సరైన పత్రాలు లేని 8 బైక్‌లను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా ఏసీపీ డాక్టర్ రవికిరణ్ మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ ముందురోజు, కౌంటింగ్ రోజు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ఠ భద్రతాచర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఉత్తర్వులు ఉల్లంఘిస్తే సదరు వ్యక్తులపై కేసులు నమోదు చేయడంతోపాటు రౌడీషీట్లు తెరుస్తామని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జగ్గయ్యపేట సీఐ పరమేశ్వర్, ఎస్ఐలు పి.రాంబాబు, పద్మారావు, అభిమన్యు, సుబ్రహ్మణ్యం, 80మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

జిల్లా అదనపు వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జూపూడి ఉషారాణి

మధురానగర్(విజయవాడసెంట్రల్): రక్తదానం ప్రాణదానంతో సమానం అని, ఒకరి రక్తదానం ముగ్గురి ప్రాణాలను నిలుపుతుందని, రక్తదానం చేయటం అలవాటుగా చేసుకోవాలని జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జూపూడి ఉషారాణి సూచించారు. ఏలూరు రోడ్డులో బుధవారం వరల్డ్ మిషన్ సొసైటీ చర్చ్ ఆఫ్ గాడ్ సంస్థ 60వ వార్షికోత్సవం సందర్భంగా నైట్రో బ్లూ కంపెనీ సహకారంతో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. 150 మంది రక్తదానం చేశారు. కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్న చర్చ్ ఆఫ్ గాడ్ నిర్వాహకులు, సహకరించిన నైట్రో బ్లూ సరఫరాదారులను ప్రతిఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. జేమ్స్, షరీఫ్, కిరణ్ పందిటి పాల్గొన్నారు.